సాక్షి
హనుమకొండ

శనివారం | 18 నవంబర్ | 2023

హై'టెక్నాలజీ ప్రచారం'
- సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం
- వాట్సాప్, ఫేస్‌బుక్ ఐడీ ఉన్నోళ్లే ప్రచారకర్తలు
- ఓట్ల కోసం అభ్యర్థుల వినూత్న ప్రయత్నాలు

-10లో

మంత్రి సత్యవతి రాథోడ్‌పై కేసు నమోదు

ఓటు హక్కు వచ్చింది ఇలా..

డిజిటల్ స్క్రీన్ ప్రచారవాహనం స్వాధీనం

-10లో

గరిష్టం/కనిష్టం
$29.0^0/19.0^0$

వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నిట్‌లో మ్యూజికల్ నైట్



కాజీపేట అర్బన్ : నిట్‌లో శుక్రవారం నిర్వహించిన క్లాసికల్ మ్యూజికల్ నైట్ అలరించింది. ప్రతి ఏడాది నిట్ స్పిక్ మేకే (సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమంగ్ యూత్) టీం క్లాసికల్ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా గ్రామీ అవార్డు గ్రహీత, ఫ్లూట్ ప్లేయర్ పండిట్ అజయ్‌ప్రసన్న, తబలా ప్లేయర్ అభిషేక్ మిశ్రా శాస్త్రీయ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో నిట్ డీన్లు త్యాగేష్ చంద్రన్, శ్రీనివాసాచార్య పాల్గొన్నారు.

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బదిలీ

వరంగల్ లీగల్ : వరంగల్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జె. ఉపేందర్‌రావును హనుమకొండ మొదటి సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నర్సంపేట సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్‌ను వరంగల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలు తక్షణమే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలి



విద్యారణ్యపురి : ఈసీ అనుమతితో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్టీయూ భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అనంతరం ఐఆర్ పెంపు, మెరుగైన పీఆర్సీ ఫిట్‌మెంట్ కోసం ఎస్టీయూ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఎస్టీయూ హనుమకొండ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కామగోని రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేమునూరి రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్లుగా భీమనాథుని రవి, రూపిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సాంబయ్య, సూరి రమేష్, ఆర్థిక కార్యదర్శిగా మేడిపల్లి విద్యాసాగర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మాలోత్ గణపతి, రాజన్న, వీరప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులుగా జి.రవీందర్, వి.పరమేశ్వర్, జి.సుమన్, రాణి, ఎం.జయసుధ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రమేష్ వ్యవహరించారు. సమావేశంలో ఎస్టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆట సదయ్య, భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

19న యువ ఓటర్లకు క్రికెట్ మ్యాచ్



హన్మకొండ అర్బన్/హన్మకొండ : స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో యువ ఓటర్లకు క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అధికారులతో కలిసి మ్యాచ్ ఏర్పాట్లను ఆమె పరిశీలించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల యువ ఓటర్లు, అధికారులతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన యువ ఓటర్లు పాల్గొని క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డీపీఓ జగదీశ్, స్పోర్ట్స్ అధికారి అశోక్ పాల్గొన్నారు.

అమిత్‌షా సభలకు సర్వం సిద్ధం
- నేడు వరంగల్, 20న జనగామకు రాక
- బహిరంగ సభల్లో ప్రసంగించనున్న కేంద్ర హోంమంత్రి

-12లో

కారు.. జోరు



పరకాల ప్రజాఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

పరకాల ప్రజా ఆశీర్వాదసభ విజయవంతం
- అభివృద్ధిని వివరిస్తూ.. విమర్శలు గుప్పిస్తూ సాగిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రసంగం
- నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3న కౌంటింగ్
- అంతటితో ఆగిపోదు.. అసలు ముచ్చట అప్పటినుంచే
- ఇక్కడ ధర్మారెడ్డి గెలిస్తేనే అక్కడ ప్రభుత్వం వస్తది
- పరకాల అభివృద్ధి నా బాధ్యత.. అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని భరోసా



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్‌ఎస్ పరకాల అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్/పరకాల: కారు ప్రచారం జోరందుకుంది. శుక్రవారం పరకాలలో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జనం రావడం.. గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ ఛలోక్తులతో సాగిన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. అభివృద్ధిని వివరిస్తూ.. ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించడంతో సభకు వచ్చినవారు చప్పట్లు, కేరింతలు కొట్టారు. మధ్య మధ్యలో 'కొత్తకుండలో ఈగ చొచ్చినట్లు..', 'రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై వారిది నెత్తా.. కత్తా', 'పాలిచ్చే బర్రెను అమ్ముకుని దున్నపోతును తెచ్చుకోవద్ద'ంటూ సామెతలు చెబుతూ ప్రతిపక్షాల తీరును ఎండగట్టారు. 'రైతుబంధు వేస్ట్ అని పీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అంటుండు.. రైతుబంధు వేస్టా..? మూడు గంటల కరెంట్ చాలు అని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అంటుండు.. ధరణిని ఎత్తేస్తామని కాంగ్రెస్సోళ్లు అంటున్నారు.. ధరణిని ఎత్తేస్తామనేవాళ్లను బంగాళాఖాతంలో కలిపేద్దామా..?, మూడు గంటల కరెంట్ కావాల్నా..? ఇరవై నాలుగంటల కరెంటు కావాల్నా ఆలోచించుకోవాలి..?' అంటూ కేసీఆర్ కాంగ్రెస్ పార్టీ, నేతలపై ధ్వజమెత్తారు. 'అన్ని వర్గాల అభ్యున్నతిని పరిగణనలోకి తీసుకొని రూ.200 నుంచి రూ.2వేల ఆసరా పింఛన్ పెంపుదల, పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్.. ఇలా చదివితే చాంతాడంత పథకాల లిస్టు అవుతుంది' అని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని ఆయన ప్రజలకు వివరించారు. 'చల్లా ధర్మారెడ్డి నా దగ్గరకు ఎప్పుడు వచ్చినా నా నియోజకవర్గానికి అది కావాలి, ఇది కావాలి అని అడిగేవాడు తప్ప, ఏనాడూ తన సొంత పని కోసం అడగలేదు.. మనిషి హైదరాబాద్‌లో ఉన్నా మనసు మాత్రం పరకాల చుట్టూ తిరుగుతుందన్నారు. చల్లా ధర్మారెడ్డి జనం మనిషి.. జనం సాదక బాధలు తెల్సిన నాయకుడ'ని కేసీఆర్ సభలో ధర్మారెడ్డికి కితాబు ఇచ్చారు. పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటాని.. ధర్మారెడ్డిని గెలిపిస్తే ఆయన అడిగిన పనులన్నీ చేసి పెడతానన్నారు. ఎన్నికలు వస్తాయ్, పోతాయని, విచక్షణతో ఆలోచించి, నిజానిజాలు తెలుసుకుని, మంచి అభ్యర్థులను గెలిపిస్తే.. మెరుగైన ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు మేలు జరుగుతుందని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఎన్నికలు రాగానే ఆగమాగం కావొద్దు.. మాయమాటలను నమ్మి మోసపోవద్దు. నవంబర్ 30 తారీఖున ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ మూడో తారీఖున ఎవరు గెలుస్తారు అనేది తేలిపోతుంది.. ఆ తర్వాత అసలు ముచ్చట మొదలవుతుంది. పరకాలలో ఎవరు గెలిస్తే అక్కడ అధికారంలోకి వాళ్లు వస్తారు' అని అన్నారు. 'పరకాలలో ఆడబిడ్డలు తాగునీళ్ల కోసం బిందెలతో ధర్నాలు చేసేది కదా.. తెలంగాణ రాగానే రైతు బాగుంటే దేశం బాగుంటుందని రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.. సంపదను పెంచుతున్నాం.. పంచుతున్నాం' అంటూ కేసీఆర్ ఉద్వేగంగా మాట్లాడారు.

పదేళ్లలో రూ.2వేల కోట్ల అభివృద్ధి : పరకాల ఎమ్మెల్యే, అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి



పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పరకాల నియోజకవర్గంలో సుమారు రెండు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకున్నామని పరకాల ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. దేశంలో, తెలంగాణలో ఎక్కడా లేని విధంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఒక్క సంగెం, పరకాల మండలాల్లోనే పదకొండు వేల మంది యువతకు ఉపాధి కల్పించబోతున్నామన్నారు. పరకాలలో ఆర్డీఓ ఆఫీస్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ఏర్పాటు చేసుకున్నామని, తాను చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందు కన్పిస్తుందన్న చల్లా ధర్మారెడ్డి... అభివృద్ధి చేసి మీ ముందున్న తనను కారు గుర్తుకు ఓటేసి గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.

కేసీఆర్ సభ ఇలా..

పరకాల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదసభకు సీఎం కేసీఆర్ శుక్రవారం సాయంత్రం 4.42 గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. 4.45 గంటలకు సభాప్రాంగణానికి చేరుకున్న కేసీఆర్.. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రసంగించగానే 4.50 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 5.16 గంటల వరకు ప్రసంగించారు. వేలాది మంది ప్రజలు రోడ్లపైనే నడుచుకుంటూ వస్తుండగానే సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించి తిరిగి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, సీనియర్ నాయకులు లింగంపల్లి కిషన్‌రావు, సహోదర్‌రెడ్డితో పాటు పరకాల నియోజకవర్గ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పరకాల ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ నాయకులు లింగంపల్లి కిషన్‌రావు, సహోదర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

హస్తం.. హోరు



వరంగల్ తూర్పులోని పోచమ్మమైదాన్ జంక్షన్‌లో కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, పక్కన కొండా సురేఖ

నర్సంపేట, వరంగల్ తూర్పులో రాహుల్ పర్యటన సక్సెస్
- అధికార పార్టీ అవినీతి డబ్బును వెలికితీసి పేదలకు పంచుతామని వ్యాఖ్య
- ఆరు గ్యారంటీల అమలే మా మొదటి ప్రాధాన్యమని అగ్రనేత హామీ
- వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మమైదాన్ వరకు పాదయాత్ర.. అనుకరించిన కాంగ్రెస్ నేతలు
- రెండు చోట్లా కార్నర్ మీటింగ్‌లకు విశేష స్పందన

రాహుల్‌గాంధీ పర్యటన ఇలా..
- మధ్యాహ్నం 2 గంటలకు నర్సంపేటకు రాక
- 2.15 గంటలకు అంబేడ్కర్ సెంటర్‌కు..
- 2.25 – 2.50 గంటల వరకు ప్రసంగం
- 3.00 గంటలకు హెలికాప్టర్‌లో వరంగల్‌కు పయనం
- 3.19 గంటలకు మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్
- 3.35 గంటలకు వరంగల్ చౌరస్తాకు రాక
- సాయంత్రం 4.00 గంటలకు పోచమ్మమైదాన్ చేరుకున్న పాదయాత్ర
- 4.10కి ప్రసంగం ప్రారంభం.. 4.31గంటలకు ముగింపు
- 4:32 గంటలకు వాహనంలో మామునూరు ఎయిర్‌పోర్టుకు.. అక్కడినుంచి హైదరాబాద్‌కు..

వరంగల్ చౌరస్తా/కాశిబుగ్గ/రామన్నపేట/నర్సంపేట రూరల్: ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ నర్సంపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గ పర్యటనలు విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. అధికార పార్టీ అవినీతిని వెలుగులోకి తెచ్చి సంపదను పేదలకు సంక్షేమ రూపంలో పంచుతామని చెప్పడంతో కార్యకర్తలు ఈలలు, కేకలతో హోరెత్తించారు. శుక్రవారం మధ్యాహ్నం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నుంచి 2 గంటలకు రాహుల్‌గాంధీ హెలికాప్టర్‌లో నర్సంపేటకు చేరుకున్నారు. తెలంగాణ జనసమితి అధినేత కోదండరాం, ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఇనగాల వెంకట్రామారెడ్డి పూలబొకేలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుని కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. అనంతరం హెలికాప్టర్‌లో మామునూరులో దిగిన ఆయన అక్కడి నుంచి వరంగల్ చౌరస్తాకు చేరుకున్నారు. అభ్యర్థి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, పార్టీ నాయకులు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

జనసంద్రంగా పాదయాత్ర

జనసంద్రంగా మారిన చౌరస్తాలో కారు దిగుతూనే రాహుల్ ప్రజలకు అభివాదం చేశారు. ప్రచారంలో భాగంగా వరంగల్ చౌరస్తా నుంచి జేపీఎన్ రోడ్డు, మండిబజార్, పోచమ్మమైదాన్ వరకు పాదయాత్ర సాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు రాహుల్‌తో పాదం కలిపారు. ప్రధాన రహదారిలో వేగంగా నడుస్తూ ఇరువైపులా వ్యాపార, వాణిజ్య సముదాయాలు, భవనాల ఎదుట, పైఅంతస్తుల్లో ఉన్న ప్రజలకు అభివాదం తెలుపుతూ రాహుల్‌గాంధీ ముందుకుసాగారు. పోచమ్మమైదాన్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో జంక్షన్ జనంతో కిక్కిరిసిపోయింది.

రాహుల్ స్పీచ్‌కు విశేష స్పందన

రాహుల్‌గాంధీ ప్రసంగానికి పార్టీ శ్రేణులు, అభిమానులు నీరాజనాలు పలికారు. పీఎం నరేంద్రమోదీ, సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావిస్తూ.. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం ఒక చెట్టు కొమ్మలేనని పేర్కొనడంతో ప్రజల నుంచి స్పందన కనిపించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రస్తావించగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కులగణన, పేదరిక నిర్మూలన, స్థానిక సంస్థల్లో కులాల లెక్కింపు, రాజకీయ ప్రాధాన్యత, ఆ మేరకు బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు, కేసీఆర్ అవినీతి అంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, నర్సంపేట, తూర్పు నుంచి పోటీ చేస్తున్న దొంతి మాధవరెడ్డి, కొండా సురేఖను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు డాల్వీ, దీప మున్సీ, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్లు తత్తరి లక్ష్మణ్, నాయకులు మీసాల ప్రకాశ్, నల్లగొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో..

నర్సంపేటలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి గెలుపు కోసం నిర్వహించిన రోడ్‌షోలో ఆ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావడంతో నర్సంపేట పట్టణంలోని వరంగల్, నెక్కొండ, మల్లంపల్లి, పాకాల రోడ్లు పూర్తిగా నిండిపోయాయి. కాగా, మహేశ్వరం గ్రామంలోని సెయింట్‌థెరిస్సా పాఠశాల ఎదుట హెలిపాడ్‌ను ఏర్పాటు చేయగా కార్యకర్తలు, నాయకులు, భారీ సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం 2గంటలకు రాహుల్‌గాంధీ హెలికాప్టర్ దిగి అభివాదం చేస్తూ ప్రత్యేక వాహనంలో నర్సంపేటలోని అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుని కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. రాహుల్ రాకతో ట్రాఫిక్‌ను మళ్లించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. డీఎస్పీలు రవీందర్, మురళి ఆధ్వర్యంలో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు బందోబస్తును నిర్వహించారు.

రౌడీ రాజ్యం.. నియంత పాలన: కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ



వరంగల్ తూర్పులో రౌడీ రాజ్యం, నియంత పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ విమర్శించారు. బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దౌర్జన్యాలు, స్థలాల కబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రెండుసార్లు ప్రజలను మభ్య పెట్టి, మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలకే మేలు జరగలేదని, కల్వకుంట్ల కుటుంబం మాత్రం బాగుపడిందన్నారు. మళ్లీ ఎన్నికల్లో అధికారం కావాలని ముందుకొస్తున్నారని, ప్రజలు గుర్తించి తిప్పికొట్టాలని, కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తూర్పు 'బీఆర్‌ఎస్'కో దండం!

గులాబీ పార్టీ వీడుతున్న ముఖ్య నేతలు
- 'నన్నపునేని' ఒంటెత్తు పోకడలతో నేతల్లో నిరాశ
- ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరిన కొందరు
- బీజేపీలోకి సైతం ద్వితీయ శ్రేణి నాయకులు
- కొండా మురళి సమక్షంలో రాజనాల, గుండా ప్రకాశ్‌రావు చేరిక
- రానున్న రోజుల్లో మరిన్ని ముఖ్య చేరికలుంటాయన్న టాక్

సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు బీఆర్‌ఎస్ రోజురోజుకూ ఖాళీ అవుతోంది. ఒకరి తర్వాత ఒకరు ముఖ్య నేతలు గులాబీ పార్టీకి బైబై చెప్పి ప్రత్యామ్నాయ పార్టీల వైపు అడుగులేస్తున్నారు. ఇన్నాళ్లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వ్యవహార శైలి నచ్చక అంతర్గత అసంతృప్తితో ఉన్న కీలక నాయకులందరూ కాంగ్రెస్ పార్టీ, ఇంకొందరు బీజేపీలోకి వెళ్తుండడంతో గులాబీ శిబిరంలో అలజడి మొదలైంది. కీలక నేతలందరూ తమకు ప్రాధాన్యతనిచ్చే పార్టీలోకి వెళ్తుండడంతో వివిధ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు కూడా రాత్రికి రాత్రే పార్టీ కండువాలు మార్చేస్తున్నారు. ఎవరూ ఊహించని విధంగా ఈ నియోజకవర్గంలో ట్రయాంగిల్ పోరు నడుస్తుందని మౌత్ టాక్ నడుస్తున్నా.. పోలింగ్ వచ్చేనాటికి రెండు పార్టీల మధ్యే ప్రధాన పోరు ఉండొచ్చన్న టాక్ ఉంది. చాలామంది ముఖ్య నేతలతోపాటు ఇంకొందరు ద్వితీయ శ్రేణి నాయకులు కాంగ్రెస్, బీజేపీలోకి వెళ్దామనుకున్నా.. ఇప్పుడే వెళ్తే పోలీసుల నుంచి ఒత్తిళ్లు మొదలవుతాయన్న నేపథ్యంలో వేచి చూసే ధోరణితో పోలింగ్ ముందు నాటికి వారికిష్టమైన పార్టీల్లో చేరేలా ప్రణాళికలు రచించుకున్నారు. పరకాల, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో ప్రభావితం చేయగల బీఆర్‌ఎస్ కీలక నేత గోపాల నవీన్‌రాజ్‌తో పాటు ఆయన బంధం, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ తదితరులకు ఇటీవల హైదరాబాద్‌లో కొండా సురేఖ మురళీధర్‌రావు సమక్షంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పారు. ఖిలా వరంగల్ మండల ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్, ఓడీసీఎంఎస్ డైరెక్టర్ కేడల జనార్దన్, చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ సాగర్ల శ్రీనివాస్, ఏనుమాముల మార్కెట్ మాజీ డైరెక్టర్లు వేణుమాధవ్, సంగరబోయిన చందర్, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, శామంతుల ఉషశ్రీపద్మ శ్రీనివాస్, బత్తిని వసుంధర, కత్తెరశాల వేణు తదితరులు చేరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రాహుల్ పాదయాత్రలో శాప్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

ఆయనతో పొసగలేకనే..

శాప్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి మంత్రి కేటీఆర్ వీరాభిమాని అయినా నరేందర్ ఒంటెద్దు పోకడలు నచ్చక ఆ పార్టీలోనే ఉంటూ చాలాసార్లు విమర్శలు గుప్పించారు. ఆయన గన్‌మెన్లను ఉపసంహరించినా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇటీవల బీఆర్‌ఎస్ రెబల్‌గా నామినేషన్ వేసిన రాజనాల శ్రీహరి చివరలో ఉపసంహరించుకున్నారు. బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశంతో ఆయన వెనక్కి తగ్గారని నరేందర్ వర్గం ప్రచారం చేయడంతోపాటు గులాబీ పార్టీలో అనుకున్నంత ప్రాధాన్యత దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఇక మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు కూడా నగరంలో ప్రభావితం చేసే వ్యక్తుల్లో ఒకరు. ఈయన తన ఎమ్మెల్యే టికెట్‌కు ఎక్కడా పోటీ వస్తారన్న ఉద్దేశంతో ఓ పోలీసుస్టేషన్ పరిధిలో పాత కేసు తిరగదోడి వేధింపులకు గురిచేయడంతో ఆయన ఇన్నాళ్లు సమయం కోసం వేచి చూశారని ఆయన మద్దతుదారులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పక్కా హామీ లభించడంతో మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు హస్తం కండువా కప్పుకున్నారు. దీంతో వరంగల్ తూర్పు కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక్కసారిగా మరింత జోష్ పెరిగినట్లయ్యింది.

మున్ముందు మరిన్ని..

బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే చుట్టూ తిరిగే ముఖ్యులు కూడా ఆయనతో బాగానే మాట్లాడుతున్నా లోలోన మాత్రం తమకు సరైన గుర్తింపు దక్కలేదన్న అసంతృప్తితో ఉన్నారు. పైకి స్నేహంగా కనిపిస్తున్నా...లోపల మాత్రం సరైన సమయంలో నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమయ్యారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. పోలింగ్ నాటికి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు చాలా మంది పార్టీ మారే అవకాశాలున్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీలోనూ బీఆర్‌ఎస్ నుంచి చేరికలు జరుగుతుండడంతో కమలం పార్టీలోనూ జోష్ పెరిగింది. శనివారం కేంద్ర మంత్రి అమిత్ షా సభ ఉండడంతో బీఆర్‌ఎస్ నుంచి కీలక నేతలు చేరే అవకాశముందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా ఎమ్మెల్యే నరేందర్ వ్యవహార శైలే తలనొప్పిగా మారడంతో ఆయన అనుయాయుల్లో ఆందోళన మొదలైంది. ఇతర పార్టీల నుంచి కొందరు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నా వాళ్లు కోవర్టులయ్యే అవకాశం ఉండడంతో వారిని దూరందూరం ఉంచుతున్నారన్న ప్రచారం సాగుతోంది.

సీఎం కేసీఆర్‌ది నిరంకుశ పాలన
- మూడోసారి అధికారం ఇస్తే ఇంటింటా మద్యం సరఫరా చేస్తరు..
- ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి వెంకట్‌నారాయణ

ఎల్కతుర్తి : కేసీఆర్‌కు మూడోసారి అధికారం ఇస్తే ఇంటింటా మద్యం సరఫరా చేసే పాలసీ తీసుకొస్తాడని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుక్షేత్రంలో కౌరవ సైన్యం ఎలా ఓడిపోయిందో రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ సైన్యం కూడా ఓడిపోనున్నట్లు జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో రూ.నాలుగు లక్షల కోట్లు అవినీతి జరిగిందని తెలిపారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ, విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాడని పేర్కొన్నారు. రూ.5.53 లక్షల కోట్లు అప్పు చేసి సీఎం కేసీఆర్ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. నాయకులు డాక్టర్ తిరుపతి, జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, రాజు, రామచంద్రం పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



యాడీ.. తార్ ఓట్ చేతి గుర్తు పర్గాల్

మానుకోట జిల్లా గూడూరు మండలంలోని తేజావత్‌రాంసింగ్ తండాలో శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీనాయక్ చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఓ చోట కూర్చున్న లంబాడ వృద్ధు రాలిని చేతి గుర్తుకు ఓటేయమని తన భాషలో కోరారు.

- గూడూరు



డాక్టర్ రాజయ్య

బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని నర్మెటలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో స్టెతస్కోప్ పట్టి వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రజలనాడిని తెలుసుకునే ప్రయత్నం చేశారు.

- నర్మెట



సమయంలేదు మిత్రమా..

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు ప్రచారంలో బీజీగా మారారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అదే పనిలో ఉంటున్నారు. ఇందులో భాగంగా ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఉదయం 5:30గంటలకు ప్రచారానికి వెళ్తూ.. ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇలా తన అల్పాహారాన్ని ముగించారు.

- ములుగు



రాహుల్ జీ.. ఈమె నా కూతురు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పర్యటించారు. ఈసందర్భంగా రాహుల్ గాంధీకి హెలీపాడ్ వద్ద తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ స్వాగతం పలికారు. ఆసమయంలో పక్కనే ఉన్న తన కుమార్తె సుస్మితను రాహుల్ గాంధీకి పరిచయం చేశారు.

హై'టెక్నాలజీ ప్రచారం'


సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం

- వాట్సాప్, ఫేస్‌బుక్ ఐడీ ఉన్నోళ్లే ప్రచారకర్తలు
- ఓట్ల కోసం అభ్యర్థుల వినూత్న ప్రయత్నాలు



వరంగల్‌కు చెందిన రఘు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాడు. ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఇతనికి సుమారు 2వేల మంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఇదే ఇప్పుడు ఇతనికి ఆదాయాన్ని సమకూరుస్తుంది. అవును.. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓ ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థికి సంబంధించిన ప్రచార బాధ్యతలు రఘుకు అప్పగించారు. దీంతో సదరు అభ్యర్థికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ.. నెలకు సుమారు రూ.20వేలకు వరకు పొందుతున్నాడు.

కాజీపేటకు చెందిన అభిరామ్ అనేక వాట్సాప్ గ్రూపుల్లో సభ్యుడు. నిత్యం వాట్సాప్ గ్రూపులను పరిశీలిస్తూ.. అందులో వచ్చిన మెసేజ్‌లకు రిప్లై ఇస్తుంటాడు. ఇతన్ని సంప్రదించిన ఓ ప్రధానపార్టీ అభ్యర్థి ప్రచారకర్తగా నియమించుకుని నెలకు సుమారు పాతిక వేల రూపాయల వేతనం సైతం ఇస్తున్నాడు. అభిరామ్ చేయాల్సిందల్లా.. సదరు అభ్యర్థికి సంబంధించిన ప్రచార విషయాలు, ఫొటోలను ఆయా గ్రూపుల్లో పోస్టు చేయడం. గ్రూపుల్లో వచ్చిన ఇతర అభ్యర్థుల ప్రచారాలపై కౌంటర్ రిప్లై ఇవ్వడం.



ఖిలా వరంగల్: గతంలో ఎన్నికలు, ప్రచారం అంటే సభలు సమావేశాలతోపాటు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, వాల్ రైటింగ్స్.. కానీ, ప్రస్తుతం ఎన్నికల ప్రచార తీరు పూర్తిగా మారిపోయింది. అభ్యర్థులు ఒక గ్రామానికో.. ఒక కాలనీకో వెళ్లినా ఆ విషయం మాత్రం ఇతర దేశాల్లోఉన్న ఈ నియోజకవర్గం ఓటరుకు సునాయాసంగా చేరుతోంది.. దీనికి కారణం సోషల్ మీడియా.. పైన చెప్పుకున్నట్లు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా రఘు, అభిరామ్ వంటి సోషల్ మీడియా ప్రచారకర్తలు ఇప్పుడు అన్నిపార్టీలకు పనిచేస్తున్నారు. ప్రచారం హోరెత్తుతోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారింది. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ నాయకులు ఎన్నికల్లో హైటెక్ టెక్నాలజీని వినియోగించుకొని తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులోకి రావడంతో వాట్సాప్, యూ ట్యూబ్, ఫేస్‌బుక్‌లతోపాటు వాయిస్ రికార్డ్ కాల్స్, మెసేజ్‌లను ఓటర్ల ఫోన్లకు పంపుతున్నారు. దీంతో ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్న ఖాతాలకు లక్షల్లో డిమాండ్ పెరిగింది. ఇలాంటి వారితో వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావహులు స్పందింపులు జరుపుతున్నారు. ప్రచార ఫొటోలతోపాటు వారికి అనుకూలంగా ఉండే పోస్టులు పెట్టాలని బేరసారాలకు దిగుతున్నారు. ప్రతి పోస్టుకు ఇంత అని లెక్కకట్టి ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. సొంత పార్టీ హామీలు, ప్రత్యర్థుల ఆరోపణలు తిప్పికొట్టేలా చేపడుతున్న ప్రచార పర్వానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు రూపొందించి ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల్లో షేర్ చేయడం వీరి పని. ఇందుకుగాను ఏజెన్సీలు, యూట్యూబ్ చానళ్ల నిర్వహకులతో ఒప్పందం కుదుర్చుకొని వ్యూహకర్తలకు రూ.లక్షల్లో చెల్లిస్తున్నట్లు సమాచారం.

చూడలేక.. చదవలేక..

ఇదంతా బాగానే ఉన్నా.. ఎన్నికల వేళ సాంకేతిక పరిజ్ఞానం మితిమీరిపోతోంది. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా చేస్తున్న ప్రచారం సగటు ఓటర్లను ఇబ్బంది పెడుతోంది. ఫొటోలు, వీడియోలు, సమావేశ సమాచారాన్ని ఒకేసారి గ్రూపులో ఎక్కువ సంఖ్యలో పోస్టు చేస్తుండటం ఓటర్లకు విసుగు తెప్పిస్తోంది. నియోజకవర్గాల స్థాయిలో ప్రధాన పార్టీ నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేశారు. తమ గ్రూపులో ఎక్కువ మంది ఉన్నారని చెప్పుకోవడానికి వారి వద్ద ఉన్న నంబర్లన్నీ కలుపుతున్నారు. ఏదైన పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే ఇష్టం ఉన్నా.. లేకున్నా మొహమాటంతో పోస్టులను చూస్తున్నారు. మరికొంత మంది పోస్టులను చూడలేక, చదవలేక సతమతమవుతున్నారు. పొరపాటున ఎగ్జిట్ అయితే పార్టీ మనిషి కాదని భావించే అవకాశం ఉందని అనేకమంది గమ్మున ఉంటున్నారు. ఒకే గ్రూపులో పార్టీకి అనుకూలంగా.. వ్యతిరేకంగా పోస్టులు వస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు.


వాయిస్‌కాల్స్ హోరు

- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

కాజీపేట: అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అభ్యర్థులు వాయిస్ మెయిల్ కాల్స్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. 'నేడు ఫలానా పార్టీ అభ్యర్థిని.. మీ ఓటు మా పార్టీ గుర్తుకే వేసి గెలిపిస్తే.. మన ప్రాంతంలోని సమస్యలు పరిష్కరిస్తా.. అంటూ వాయిస్ కాల్‌ను నియోజకవర్గంలోని ఓటర్ల ఫోన్‌లకు ప్రతిరోజూ పంపిస్తూ తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతోపాటు యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు సోషల్ మీడియా వేదికగా పోటీలోఅభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఏ వాట్సాప్ గ్రూపు చూసినా.. ఏ ఫేస్ బుక్ పేజీ ఓపెన్ చేసినా ఏదో ఒక అభ్యర్థి ప్రచార చిత్రాలు, వీడియోలే దర్శనమిస్తుండడం గమనార్హం.

ఈ ముచ్చటెరికేనా ?

ఓటు హక్కు వచ్చింది ఇలా..



కాజీపేట: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో మొట్టమొదటి సారిగా సార్వత్రిక ఓటు హక్కు విధానం అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని 326 అధికరణం ద్వారా సార్వత్రిక ఓటు హక్కును కల్పించారు. ఇది ప్రపంచ చరిత్రలో ఒక విప్లవాత్మక చర్యగా అభివర్ణిస్తుంటారు. ఎందుకంటే సార్వత్రిక ఓటుహక్కు అమలుకావడానికి చాలా దేశాల్లో వందల సంవత్సరాలు పట్టింది. మనకు స్వాతంత్ర్యం వచ్చిన మూడేళ్ల కాలంలోనే 21 ఏళ్లు నిండిన అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించారు.

మంత్రి సత్యవతి రాథోడ్‌పై కేసు నమోదు

గూడూరు: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ డబ్బులు పంపిణీ చేశారన్న ఫ్లయింగ్ స్కాడ్ టీం ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా గూడూరు మండలంలోని మట్టెవాడ శివారు కొంగరగిద్ద గ్రామంలో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ గెలుపుకోసం గిరిజన శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ప్రచారంలో చేశారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. దీంతో ప్రచారం ముగించుకుని వెళ్తుండగా.. మంగళహారతులు పట్టిన మహిళలు మంత్రి సత్యవతిరాథోడ్‌ను అమ్మా సంతోషంగా మాకేమైనా కానుక ఇవ్వవా అని అడగ్గా.. అందుకు మంత్రి వారి సంతోషం కోసం వారి చేతిలో ఉన్న మంగళహారతి పల్లెంలో కానుకగా కొంత డబ్బును పెట్టారు. ఈ విషయమై ఎఫ్ఎస్‌టీ ప్రతినిధులు డబ్బులు పంచడం నేరమంటూ గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ప్రకృతి రక్షణ అందరి బాధ్యత

జనగామ రూరల్: ప్రకృతిని రక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. జాతీయ ప్రకృతి దినోత్సవం సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అండ్ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'మానవ జీవన విధానంలో ప్రకృతి ప్రాత' అనే అంశంపై చేపట్టిన ఈ పోటీల్లో 8, 9 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ధర్మకంచ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.ఐశ్వర్య ప్రథమ బహుమతి రూ.3,000, వావిలాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వైష్ణవి ద్వితీయ బహుమతి రూ.2000, ఖిలాషాపురానికి చెందిన కిరణ్మయి తృతీయ బహుమతి రూ.1000 అందుకున్నారు. కార్యక్రమంలో తోట రాజు, రమేష్, గొసియాబేగం, కనకయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

రూ.8.2 లక్షలు స్వాధీనం

డోర్నకల్: మహబూబాద్ జిల్లా డోర్నకల్, ముల్కలపల్లి చెక్‌పోస్టుల వద్ద శుక్రవారం ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.8.20,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. డోర్నకల్ చెక్ పోస్టు వద్ద ఖమ్మం నుంచి డోర్నకల్‌కు కారులో వస్తున్న డోర్నకల్‌కు చెందిన ఎం.నాగేశ్వర్‌రావు వద్ద రూ.6.90,000 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నాగేశ్వర్‌రావు వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో డబ్బును సీజ్ చేశారు. ఇదే చెక్‌పోస్ట్ వద్ద ఖమ్మం నుండి మహబూబాబాద్‌కు వెళ్తున్న ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన గోపాల్‌రావు వద్ద రూ.66,000 పట్టుకుని రసీదులు లేకపోవడంతో డబ్బు సీజ్ చేశారు. ముల్కలపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఖమ్మం నుండి మహబూబాబాద్‌కు వెళ్తున్న సీరోలు మండలం తాళ్లసంకీసకు చెందిన శ్రీను వద్ద 64,000 సీజ్ చేశారు.



చెక్‌పోస్టువద్ద రూ.1.34లక్షలు

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని క్రాస్ రోడ్‌లోని చెక్ పోస్టు వద్ద శుక్రవారం నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తున్న రూ.1.34లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎస్‌టీ అధికారులు మీర్జా ముస్వర్‌బేగ్, చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన వైద్యుల కుమార్‌రెడ్డి రూ.82వేలు, పార్వతమ్మగూడెం గ్రామానికి చెందిన బి.శ్రీనివాస్ రూ.52వేలను ఇంటికి తీసుకెళ్తున్నారు. ఎన్నిలక నిబంధనలను అతిక్రమించి పరిమితికి మించి డబ్బులు తీసుకెళ్తున్నందున రూ.1.34లక్షలను స్వాధీనం చేసుకుని, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అలివేలుకు అప్పగించినట్లు తెలిపారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి



సదస్సులో మాట్లాడుతున్న వీసీ రమేశ్, వేదికపై మాజీ ఎంపీ సీతారాంనాయక్ తదితరులు

- కేయూ వీసీ తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్: విశ్వవిద్యాలయాల్లోని పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. శుక్రవారం కేయూలోని బాటనీ విభాగంలో రీసెంట్ అడ్వాన్స్ ఇన్ బొటానికల్ రీసెర్చ్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాక్, వెల్స్ ప్రతినిధుల బృందం కేయూలోని గ్రీన్‌బెల్ట్‌ను అభినందించిందన్నారు. హెర్బల్ బొటానికల్ గార్డెన్లను నిర్మించుకుందామన్నారు. వివిధ సబ్జెక్టులు, విభాగాల మధ్య మల్టిడిసిప్లెన్ అప్రోచ్ అవసరం అన్నారు. కేయూ మాజీ వీసీ విద్యావతి మాట్లాడుతూ.. విద్యార్థులు తమను అభివృద్ధి చేసిన అధ్యాపకులను మరవొద్దన్నారు. బాటనీ విభాగంలో పరిశోధనలు విస్తృతం కావాలని సూచించారు. విశ్రాంత ఆచార్యులు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ.. వివిధ పథకాల ప్రతిపాదనలు జాతీయ సంస్థలకు అందించానన్నారు. జాతీయ సేవాపథకం ట్రైనింగ్ సెంటర్‌కు కూడా అనుమతి వచ్చిందన్నారు. ఈసదస్సులో లక్నో సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు నవీన్‌కుమార్ కీలకపోన్యాసం చేశారు. సదస్సులో బాటనీ విభాగం అధిపతి డాక్టర్ లక్ష్మారెడ్డి, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్ ఆచార్య ముస్తఫా, ఆచార్యులు ఎస్ఎంరెడ్డి, మనోహారచారి, తిరుపతయ్య, సదానందం, రామస్వామి, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు. కాగా బాటనీ విభాగం పూర్వవిద్యార్థుల సంఘం, బాటనీ విభాగం సహకారంతో నిర్వహించిన సదస్సులో బాటనీ విభాగం వార్షిక నివేదిక బొటానిక్స్‌ను ఆవిష్కరించారు.

అధికారిపై కేసు నమోదు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళా ఉద్యోగినిపై వేధింపులకు పాల్పడిన చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు. రైల్వే స్టేషన్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగినిపై గత కొన్ని నెలలుగా అనుచితంగా ప్రవరిస్తు లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని, ఈనెల 14న 4 నిమిషాలు విధులకు ఆలస్యంగా రావడంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అప్‌సెంట్ వేశాడని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యాయత్నం చేస్తుండగా తోటి ఉద్యోగులు అడ్డుకుని నచ్చజెప్పారు. ఈ విషయంపై ఆమె రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి గురువారం చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌పై స్థానిక జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈఘటనపై రైల్వే ఉన్నతాధికారులు సైతం విచారణ చేసినట్లుగా తెలిసింది.

వ్యక్తి ఆత్మహత్య

గీసుకొండ: తాగుడుకు బానిసైన వ్యక్తి భార్యతో గొడవపడి తాగిన మైకంలో ఇంట్లోని క్రిమిసంహారక గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత, కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్‌హవేలికి చెందిన దేవులపెల్లి శంకర్(52) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. గురువారం రాత్రి ఇంటికి తాగి వచ్చి భార్య కౌసల్యతో గొడవపడి ఇంట్లోని గుళికలను మింగడంతో 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. శుక్రవారం శంకర్ కుమార్తె రజని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ రామకృష్ణ వెల్లడించారు.

వినియోగదారులకు టోకరా

- రూ.14,59,479 కాజేసిన వ్యక్తి
- కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : హౌజింగ్ ఫైనాన్స్ వినియోగదారులకు నకిలీ రశీదులు ఇచ్చి రూ.14,59,479 కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రాంతంలో మహేంద్ర రూరల్ హౌజింగ్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అందులో తొర్రూరు మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల వేణుకుమార్ కష్టమర్ మేనేజరుగా పని చేసేవాడు. ఈ క్రమంలో వేణుకుమార్ వినియోగదారుల వద్దకు వెళ్లి ఋణాల బకాయిలు వసూలు చేసే సమయంలో నకిలీ రశీదులు ఇచ్చి రూ.14,59,479 వరకు వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని మహేంద్ర రూరల్ హౌజింగ్ ఫైనాన్స్ సంస్థలో జమ చేయలేదు. పైగా అతడు ఆ సంస్థలో విధులకు రావటం కూడా మానేశాడు. కొద్ది రోజుల అనంతరం కొత్త మేనేజరుగా చెర్లపల్లి నరేశ్ వచ్చాక సంస్థకు సంబంధించిన లావాదేవీలను పరిశీలించారు. వినియోగదారుల వద్దకు వెళ్లి ఋణాల బకాయిలు కట్టాలని అడుగగా వారు అప్పటికే సొమ్ములు చెల్లించామని చెప్పడంతో వారి వద్ద ఉన్న రశీదులను పరిశీలించి చూశారు. అవి నకిలీవని గుర్తించి వేణుకుమార్ రూ.14,59,479 మొత్తానికిగాను వినియోగదారులకు నకిలీ రశీదులు ఇచ్చి మోసం చేసినట్లు గుర్తించారు. జరిగిన సంఘటనపై వెంటనే చెర్లపల్లి నరేశ్ మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

58కిలోల ఎండు గంజాయి స్వాధీనం

- విలువ రూ.14,50,000

మడికొండ: హనుమకొండ జిల్లా మడికొండ చౌరస్తా వద్ద టాస్క్‌ఫోర్స్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ కాజీపేట, మడికొండ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అల్తాఫ్ అమీన్ ఖాన్(26), ఒడిశా రాష్ట్రానికి చెందిన తపన్ పాణి (47) సులభంగా డబ్బులు సంపాదించడానికి ఒడిశా సరిహద్దు నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద ఎండు గంజాయి కిలో రూ.5వేలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించి అక్కడ కిలో గంజాయి రూ.25వేలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో గంజాయితో కాజీపేట రైల్వే స్టేషన్‌లో రైలు దిగి బస్సులో వెళ్లేందుకు బస్సు స్టాప్ వద్దకు వెళ్లగా అక్కడ పోలీసులు ఉండడంతో మడికొండ సెంటర్ వద్ద బస్సు ఎక్కడానికి వచ్చారు. దీంతో అనుమానాస్పదంగా ఉన్న ఇరువురిని పోలీసులు తనిఖీ చేసి గంజాయిని సీజ్ చేసి సుమారు రూ.14,50,000 లక్షల విలువ చేసే 58 కిలోల ఎండు గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మడికొండ ఎస్‌హెచ్ఓ వేణు, ఎస్సై రాజబాబు, ఏఎస్సై చంద్రమౌళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ స్క్రీన్ ప్రచార వాహనం స్వాధీనం

శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ప్రచార వాహనంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌కు పర్మిషన్ పత్రాలు చూపకపోవడంతో ఎన్నికల మోడల్ కోడ్ అధికారి తహసీల్దార్ సుభాషిణి ప్రచార వాహనాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల అధికారులు తనిఖీ చేసిన సమయంలో వాహనానికి మాత్రమే పర్మిషన్ పత్రాలు చూపించారు. దీంతో డిజిటల్ స్క్రీన్ పర్మిషన్ పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం డిజిటల్ స్క్రీన్ పత్రాలు చూపించడంతో వాహనాన్ని వదిలి వేసినట్లు తహసీల్దార్ సుభాషిణి తెలిపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనం


శుభకార్యానికి వెళ్లి వస్తూ..

- చెట్టును ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం

రేగొండ: పలువురు స్నేహితులు కలిసి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ.. వారు ప్రయాణిస్తున్న కారు చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు మృత్యువాతపడగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన ఓ శుభకార్యానికి 8 మంది మిత్రులు కారులో వెళ్లి హాజరై, తిరిగి కొత్తపల్లిగోరికి వస్తున్న క్రమంలో రేగొండ సమీపంలోని మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనలో కొత్తపల్లిగోరి మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పూజారి పవన్‌కల్యాణ్ (24), టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన చింతల సాయికిరణ్(23) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పర్వతగిరి మండలం బూర్గుమల్ల గ్రామానికి చెందిన శరత్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. పవన్‌కల్యాణ్ తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దంతలపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాపగిరి గ్రామానికి చెందిన బండెల లతీష్(22) మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. శుక్రవారం తన ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా దంతలపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు, బంధువులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని భూపాలపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి బుచ్చిమల్లు గత రెండేళ్ల క్రితం మృతి చెందగా తల్లి విజయ, అన్న లవాకర్ ఉన్నారు. ప్రమాదానికి సంబంధించిన ఫిర్యాదు అందలేదని కాటారం పోలీసులు తెలిపారు.



పవన్‌కల్యాణ్, సాయికిరణ్ (ఫైల్) లతీష్ (ఫైల్)